సాక్షి
తిరుపతి
గురువారం । 18 । జూలై । 2024



చిల్లకూరులో రొట్టెల పండుగ రేపు
చిల్లకూరులోని దో షాహీద్ దర్గా రొట్టెల పండుగకు ముస్తాబైంది. భారా షాహీద్ దర్గా తర్వాత చిల్లకూరుకు ఆ పేరుంది. - 8లో



అంతరిక్షాన్ని చూసేద్దాం!
తిరుపతిలోని ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో సరికొత్త ప్రదర్శనతో డిజిటల్ ప్లానిటోరియాన్ని పునఃప్రారంభించారు. - 8లో



బైక్ దొంగ అరెస్ట్
కాణిపాకం పోలీసులు బుధవారం ద్విచక్ర వాహనాల దొంగను అరెస్టు చేసి, 12 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. - 8లో



తమ్ముళ్లూ! మీ కలలు సాకారం చేస్తా..ఇంటికో ఉద్యోగం ఇస్తా..లేదంటే నిరుద్యోగ భృతి కింద మూడు వేలు ఇస్తా.. అని ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు.అధికారంలోకి వచ్చి నెల దాటినా దీనిపై పెదవి విప్పడం లేదు.. 2014లోనూ రూ.2వేలు భృతి ఇస్తానంటూ అధికారంలోకి వచ్చాక హామీ నెరవేర్చలేదు.

భృతి.. భ్రాంతి!

- నిరుద్యోగ భృతి కోసం ఎన్నాళ్లీ ఎదురుచూపులు?
- గతంలో రూ.2వేలు భృతి ఇస్తామని శఠగోపం పెట్టిన చంద్రబాబు
- ఇప్పుడు రూ.3వేల భృతి కోసం నిరుద్యోగుల నిరీక్షణ
- జాబ్ క్యాలెండర్ వస్తుందన్న ధీమాతో యువత కోచింగ్ బాట
- జాబ్ క్యాలెండర్‌పై జాప్యమెందుకో..?
- జిల్లాలో 6.23 లక్షలమంది అర్హులు
- భృతి ఎప్పుడిస్తారో ప్రకటించాలని డిమాండ్
- సూపర్ సిక్స్ హామీలపై నోరు మెదపని బాబు సర్కార్



అంతా భ్రాంతియేనా.. / భృతి హామీ నీటిబుడగేనా.. / ఆశా నిరాశేనా.. / ఇక మిగిలిందీ చింతేనా.. / బాబూ..ఇక అశాంతేనా!?

అనే లెవెల్లో నిరుద్యోగులు నిరుద్యోగ భృతి మీద నిరసన శృతి రాగం అందుకుంటున్నారు. అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం ..లేదంటే ఉద్యోగం వచ్చేవరకు నిరుద్యోగ భృతి కింద రూ.3వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు ప్రకటించారు. అంతకు మునుపు 2014 ఎన్నికల్లో సైతం ఇదే హామీతో నిరుద్యోగులకు గాలం వేశారు. రూ.2వేలు భృతి ఇస్తామని ప్రకటించి అధికారంలోకి వచ్చినా ఒక్కరంటే ఒక్కరికీ ఇవ్వలేదు. మళ్లీ 2024 ఎన్నికల్లో అదే హామీకి మరో రూ.1000 అదనంగా కలరింగ్ ఇచ్చి మళ్లీ వల విసిరారు. మళ్లీ ఈసారి కూడా ఆయన హామీని నిరుద్యోగులు నమ్మారు. అధికారంలోకి వచ్చి నెలన్నర కావొస్తున్నా భృతి గురించి చంద్రబాబు పెదవి విప్పకపోవడంతో మళ్లీ తమకు శఠగోపం పెడతారేమోనని నిరుద్యోగులు ఒకింత ఆందోళన చెందుతున్నారు.

తిరుపతి సిటీ: యువతకు 20 లక్షల ఉద్యోగాలు, జాబ్ వచ్చినంతవరకు నెలకు రూ.3వేలు భృతి... ఇవీ ఎన్నికల సమయంలో 'సూపర్ సిక్స్'లో భాగంగా నిరుద్యోగ యువతకు చంద్రబాబు ఇచ్చిన ప్రధాన హామీలు. కూటమి ప్రభుత్వం పాలనా పగ్గాలు స్వీకరించి నెల రోజులపైగా గడుస్తున్నా ఇంతవరకు నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్‌పై నోరు మెదపడం లేదు. అప్పట్లో నిరుద్యోగ భృతి పేరిట వంచించినట్లే ఈసారి కూడా అలాగే దగా చేస్తారేమో!? అనే ప్రశ్నలు నిరుద్యోగుల్లో ఉదయిస్తున్నాయి.

జాబ్ క్యాలెండర్‌పై ఆశతో యువత కోచింగ్ బాట

జిల్లాలో ఉద్యోగాలు, ఉపాధి కోసం నిరుద్యోగ యువత ఎంతో ఆశతో ఎదురు చూస్తోంది. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తారనే ఆశతో ప్రస్తుతం పని చేస్తున్న ప్రైవేటు ఉద్యోగాలను, చిన్నాచితకా పనులను వదిలేసి కోచింగ్ సెంటర్ల బాట పట్టారు. రాష్ట్రంలోని ప్రధాన పట్టణాల్లో పేరొందిన కోచింగ్ సెంటర్లకు జిల్లా యువత క్యూ కడుతోంది. ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేస్తారనే నమ్మకంతో కోచింగ్ సెంటర్లకు లక్షలాది రూపాయలు చెల్లించి ప్రిపరేషన్ ప్రారంభించారు.

నియోజకవర్గం	భృతికి అర్హులు	చెల్లించాల్సిన మొత్తం(రూ.కోట్లలో)
తిరుపతి	1,30,000	39కోట్లు
చంద్రగిరి	85,000	25.50కోట్లు
శ్రీకాళహస్తి	93,000	27.90కోట్లు
సత్యవేడు	80,000	24కోట్లు
వెంకటగిరి	90,000	27కోట్లు
గూడూరు	75,000	22.50కోట్లు
సూళ్లూరుపేట	70,000	21కోట్లు



ఇందులో ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, టీటీసీ, డిప్లమో చేసినవారు	1,25,000
డిగ్రీ, బీటెక్, బీఈడీ పూర్తి చేసిన వారి సంఖ్య	1,55,000
పీజీ, పీహెచ్‌డీ	85,000
వృత్తి విద్య, మెడికల్, టెక్నికల్ కోర్సులు పూర్తి చేసినవారు	2,58,000

నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇస్తే తమకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని అప్పులు చేసి పోటీ పరీక్షలకు సమాయత్తమవుతున్నారు. నిరుద్యోగ భృతికి గతంలో బాబు ప్రభుత్వం 22 నుంచి 33 ఏళ్లలోపు వారు మాత్రమే అర్హులని ప్రకటించింది. దీనిపై అప్పట్లో నిరుద్యోగులు మండిపడ్డారు. హామీని నెరవేర్చని బాబు సర్కారుకు 2019లో తగిన బుద్ధి చెప్పారు.

'బాబు' సర్వే ప్రకారం జిల్లాలో భృతికి అర్హులు 6.23 లక్షల మంది

ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఓ ప్రైవేటు ఎన్‌ఆర్‌ఐ సంస్థ ద్వారా తిరుపతి జిల్లాలో సర్వే చేయించారు. దీని ప్రకారం పదవ తరగతి నుంచి పీజీ, పీహెచ్‌డీ వరకు నియోజకవర్గాల వారీగా నిరుద్యోగ భృతికి అర్హులైన నిరుద్యోగుల జాబితా దాదాపుగా 6,23,000 మంది ఉన్నట్లు తేలింది. ఈ లెక్కన ప్రతి నిరుద్యోగికి రూ.3వేల చొప్పున మొత్తం రూ.186.90కోట్లు నెలకు చెల్లించాల్సి ఉంది. ఆ సర్వే సంస్థ బాబుకు ఇచ్చిన నివేదిక ప్రకారం నియోజకవర్గాల జాబితా సుమారుగా..

ప్రతి నిరుద్యోగికీ భృతి ఇవ్వాలి



జిల్లాలో సుమారు 6లక్షలకు పైగా నిరుద్యోగులు ఉన్నారు. అంక్షలతో కొర్రీలు పెట్టకుండా ప్రతి నిరుద్యోగికీ రూ.3వేలు భృతి ఇవ్వాలి. రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్ కోసం నిరీక్షిస్తున్నారు. అప్పులు చేసి, లక్షలు వెచ్చించి, కోచింగ్ సెంటర్లలో చేరుతున్నారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు సకాలంలో విడుదల చేసి పోస్టులు భర్తీ చేయాలి. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తాం.
– ప్రీతి, ఏఐ స్టూడెంట్స్ ఫెడరేషన్ స్టేట్ గర్ల్స్ కో–కన్వీనర్, తిరుపతి జిల్లా

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి



ఎస్వీయూలో పీజీ పూర్తి చేశాను. ప్రస్తుతం గ్రూప్స్ పరీక్షల కోసం ప్రిపేర వుతున్నాను. కూటమి ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు పైగా అయ్యింది. చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీని నెరవేర్చాలి. దీంతో పాటు జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసి పోస్టులు భర్తీ చేయాలి. గతంలో బాబు నిరుద్యోగ భృతి హామీని నెరవేర్చలేదు. ఈసారైనా ఇచ్చిన మాటకు కట్టుబడాలని కోరుతున్నాం.
– రోహిణి, ఎస్వీయూ, తిరుపతి

భృతిపై స్పష్టతేదీ?



నేను డిగ్రీ పూర్తి చేశాను. ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నా. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తారన్న ఆశతో ఉద్యోగం వదులుకుని, కోచింగ్ సెంటర్‌లో చేరి, పోటీ పరీక్షలకు ప్రిపేరవుతున్నాను. చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసి నెలరోజులైపోయింది. ఇంకా జాబ్ క్యాలెండర్‌పైనా, భృతిపైనా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. గతంలో లాగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే నిరుద్యోగులు మళ్లీ మోసపోయినట్టే. ప్రభుత్వం రూ.3వేలు భృతి ఇచ్చి యువతను ఆదుకోవాలి.
– పురుషోత్తం, శ్రీకాళహస్తి

నిరుద్యోగ భృతి కోసం ఎదురు చూస్తున్నాం



పీజీ పూర్తి చేశాను. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం సాధించాలని కోచింగ్ తీసుకుంటున్నాను. నాలాగా ఎంతో మంది యువత పోటీ పరీక్షల కోసం లక్షలు ఖర్చుపెట్టి రాష్ట్రంలోని ప్రధాన పట్టణాలలో కోచింగ్ తీసుకుంటున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి నెలరోజులు దాటింది. నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం స్పందించలేదు. నెలకు రూ.3వేలు ఉద్యోగం వచ్చేంతవరకు ఇస్తామని బాబు హామీ ఇచ్చారు. దానిని నెరవేర్చాలి. జిల్లా వ్యాప్తంగా ఎంతోమంది భృతికోసం ఎదురుచూస్తున్నారు.
– ఎం నాగేశ్వర నాయక్, చంద్రగిరి

హామీ నెరవేర్చకపోతే ఆగ్రహం చవిచూడకతప్పదు



ప్రభుత్వం జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతికి ఎదురు చూస్తున్నాం. నిరుద్యోగుల పరిస్థితిని ప్రభుత్వం అర్థం చేసుకుని ఈ నెల నుంచి భృతిని ఇవ్వాలి. గ్రూప్స్, పోలీసు, బ్యాంకు పోటీ పరీక్షల కోసం చేస్తున్న చిన్న ఉద్యోగాలు వదులుకుని కర్నూలులో కోచింగ్ తీసుకుంటున్నా. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేసి చంద్రబాబు తన హామీని నిలబెట్టుకోవాలి. లేదంటే నిరుద్యోగులు ఆగ్రహానికి గురికాక తప్పదు.
– సి.పెంచలయ్య, సూళ్లూరుపేట

నిరుద్యోగ భృతిపై నిర్లక్ష్యమెందుకు?



నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదు. ఇచ్చిన హామీని ప్రకారం ప్రతి నెలా నిరుద్యోగులకు రూ.3వేలు చెల్లించాలి. తిరుపతిలో పీజీ చేస్తూ పోటీపరీక్షలకు సిద్ధమవుతున్నాను. కుటుంబంలో ఎంతమంది నిరుద్యోగులు ఉంటే అందరికీ భృతి ఇవ్వాలి. గతంలో చంద్రబాబు 22 నుంచి 35ఏళ్ల లోపు వారికి మాత్రమే అంటూ షరతులు పెట్టకుండా ఏపీపీఎస్సీ విధించే వయోపరిమితి ప్రకారం నిరుద్యోగ భృతి ఉద్యోగం వచ్చేంతవరకు ఇవ్వాలి.
– స్రవంతి, వెంకటగిరి

భృతి ఇవ్వాలి..డీఎస్సీ పోస్టులు పెంచాలి



నేను బీఈడీ పూర్తి చేసి ప్రస్తుతం డీఎస్సీ కోసం ప్రిపేరవుతున్నా. పట్టణంలోని ఓ ప్రైవేటు కోచింగ్ సెంటర్‌లో చేరాను. నిరుద్యోగ భృతి హామీని నెరవేర్చాలి. ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేయాలి. మెగా డీఎస్సీ కేవలం 16వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేశారు. రాష్ట్రంలో సుమారు 53వేలకు పైగా టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఏడాది కనీసం 30వేల పోస్టులను నోటిఫికేషన్‌లో చేర్చి యువతను ఆదుకోవాలి. – సుస్మిత, డీఎస్సీ అభ్యర్థి, తిరుపతి

ఆంక్షలు విధిస్తే ఉద్యమిస్తాం



నిరుద్యోగ భృతి హామీని కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో నెరవేర్చాలి. వయస్సు, విద్యార్హతలు, రేషన్‌కార్డు వంటి షరతులు విధిస్తే ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమిస్తాం. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న ప్రతి పోస్టునూ భర్తీ చేయాలి. పారదర్శకంగా పోటీపరీక్షలు నిర్వహించాలి. నిరుద్యోగులకు భృతిని ప్రభుత్వ ఉద్యోగం వచ్చేంతవరకు ఖచ్చితంగా ఇవ్వాలి.
– ప్రవీణ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి, తిరుపతి జిల్లా

న్యూస్‌రీల్

పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేసిన ఎస్పీ



తనిఖీ చేస్తున్న ఎస్పీ సుబ్బారాయుడు

శ్రీకాళహస్తి : తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు బుధవారం శ్రీకాళహస్తి, తొట్టంబేడు, 1టౌన్, 2టౌన్ పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు. ఆయా స్టేషన్లలో రికార్డులను పరిశీలించారు. నమోదైన కేసులు, పరిష్కరించిన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆలయం, శాంతిభద్రతలు, ట్రాఫిక్ తదితర అంశాలపై డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డితో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తిరుపతి జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌ను అద్దె భవనంలో నిర్వహిస్తున్నారని, దానిని కూడా కొత్తగా నిర్మిస్తున్న డీఎస్పీ కార్యాలయంలోనే ఉండేలా చూస్తామన్నారు. అవసరాన్ని బట్టి నూతన భవన నిర్మాణానికి అనుమతులు తీసుకుంటామన్నారు. అలాగే ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 10 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 71,409 మంది స్వామివారిని దర్శించుకోగా 26,128 మంది భక్తుల తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.15 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం అవుతుండగా, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

146మంది విద్యార్థులు స్వగ్రామాలకు..



నాయుడుపేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం



నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న గురుకుల విద్యార్థి

- నెల్లూరులో 17 మంది విద్యార్థులకు కొనసాగుతున్న వైద్యసేవలు
- సోమవారం డిశ్చార్చి అయిన వారిలో మళ్లీ కొందరికి అస్వస్థత
- ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరిక

నాయుడుపేట టౌన్ : స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకులంలో కలుషిత ఆహారం తిని 149 మంది విద్యార్థులు అస్వస్థతకు గురవడం విదితమే. వీరిలో బుధవారం నాటికి నాయుడుపేట, సూళ్లూరుపేట, గూడూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారిలో 126 మంది విద్యార్థులకు వాంతులు, విరోచానాలు తగ్గుముఖం పట్టి వారి స్వగ్రామాలకు వెళ్లిపోయినట్లు అధికారులు వెల్లడించారు. 17 మంది విద్యారులు తీవ్ర అస్వస్థతతో ఉండడంతో వారికి నెల్లూరు జీజీహెచ్‌లో మెరుగైన వైద్య సేవలను అందిస్తున్నారు. వీరిలో నలుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటం వల్ల ఐసీయూలో ఉంచి చికిత్స చేస్తున్నట్టు వైద్యులు తెలిపారని స్థానిక గురుకులు స్టాఫ్ నర్సు ప్రవీణ పేర్కొన్నారు. ప్రస్తుతం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో చిట్టమూరు మండలం వెలిగాజులుపల్లెకు చెందిన ఒక విద్యార్థి, సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలలో ఐదుగురు, గూడూరు ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ముగ్గురు విద్యార్థులకు చికిత్స కొనసాగిస్తున్నారు. అస్వస్థతకు గురైన గురుకుల విద్యార్థులకు సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని పర్యవేక్షణలో తహసీల్దార్ కల్యాణి, డీటీ రాజేంద్ర ఆహార సదుపాయాలను కల్పిస్తూ ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్‌కు సమాచారం నివేదిస్తున్నట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా సోమవారం ఇళ్లకు వెళ్లిన కొంత మంది గురుకుల విద్యార్థులు వాంతులు, విరోచనాల సమస్యతో మళ్లీ అస్వస్థతకు గురవడంతో పలు ప్రవేటు వైద్యశాలల్లో చేరి చికిత్స పొందుతున్నారు.

గురుకులంలో ముమ్మరంగా మరమ్మతులు

నాయుడుపేట గురుకుల పాఠశాలలో పారిశుధ్యం, మరుగుదొడ్ల పరిస్థితి దారుణంగా ఉండడంతో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేస్తున్నారు. మరుగుదొడ్లను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అవసరమైన పనులు చేపట్టారు. ఈ పనుల మూలాన సెలవులు మరి కొన్ని రోజులు పొడిగించే అవకాశం లేకపోలేదు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి, పారిశుధ్యం పూర్తిస్థాయిలో మెరుగు పరిస్తేనే గురుకులానికి తిరిగి తమ పిల్లలను పంపిస్తామని, అలా కాని పక్షంలో ఇళ్ల వద్దే ఉంచుకుని చదివిస్తామని తల్లిదండ్రులు ఉన్నతాధికారులకు ఇప్పటికే తేల్చి చెప్పారు.

అవధానం విద్యార్థులకు జ్ఞానయజ్ఞం



మాట్లాడుతున్న వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ: అవధాన ప్రక్రియ జ్ఞాన యజ్ఞం లాంటిదని, విద్యార్థుల మేధోసంపత్తిని పెంపొందించేందుకు దోహదపడుతుందని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి అన్నారు. బుధవారం వర్సిటీలో చెలికాని అన్నారావు భవనంలో జరిగిన అవధాన సంగమం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులకు అవధానంపై ఆసక్తిని కలిగించి, విభిన్న అవధాన ప్రక్రియలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రాచీన విద్య అయిన అవధాన ప్రక్రియను ఆధునిక కాలంలోని విద్యార్థులు తెలుసుకుని, జ్ఞానాన్ని వృద్ధి చేసుకోవాలని సూచించారు. అనంతరం స్విమ్స్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ అల్లాడి మోహన్ మాట్లాడుతూ, అవధాన ప్రక్రియలో విభిన్న రకాలైన అవధానాల ద్వారా విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టవచ్చన్నారు. కార్యక్రమంలో రిషివుడ్ వర్సిటీ మానవ విజ్ఞానకేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ సదానంద మిశ్రా, ప్రొఫెసర్ సచ్చిదానందమూర్తి, డాక్టర్ వైష్ణవి, డీన్లు ప్రొఫెసర్ దక్షిణమూర్తి శర్మ, ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి సహకరించండి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరిన తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి



రేణిగుంట విమానాశ్రయంలో కేంద్రమంత్రికి వివరిస్తున్న ఎంపీ గురుమూర్తి

రేణిగుంట : తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గంలోని జాతీయ రహదారుల అభివృద్ధికి సహకరించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కోరారు. రేణిగుంట విమానాశ్రయ వీఐపీ లాంజ్‌లో బుధవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ జాతీయ రహదారులు, హైవే ప్రాజెక్టులపై సమీక్షలో తిరుపతి ఎంపీ, పలు రహదారుల విస్తరణ ఆవశ్యకతను కేంద్రమంత్రికి నివేదించారు. వాటిలో ప్రధానంగా తిరుపతి సమీపంలోని కాలూరు జంక్షన్ నుంచి వయా చెర్లోపల్లె, ఎస్వీ యూనివర్సిటీ, ఎన్టీఆర్ సర్కిల్, రైల్వే స్టేషన్, రామానుజ సర్కిల్, రేణిగుంట కేఎల్ఎం హాస్పిటల్ జంక్షన్ వరకు, నాయుడుపేట బస్టాండ్ జంక్షన్ కి.మీ 182/200 నుంచి పండ్లూరు కి.మీ. 190/600 తిరుపతి నగర సరిహద్దుల మీదుగా వెళ్లే మదనపల్లె, నాయుడుపేట 71వ జాతీయ రహదారిని అభివృద్ధి చేయాలని కోరారు.

- ఎకనామిక్ కారిడార్ కనెక్టివిటీ రోడ్ల ప్రతిపాదనకు సంబంధించి జాతీయ రహదారి 16 తడ నుంచి జాతీయ రహదారి 71 శ్రీకాళహస్తి వరకు, జాతీయ రహదారి 716ఏ ఉత్తుక్కోట్టై నుంచి జాతీయ రహదారి16 తడ, జాతీయ రహదారి16 ఏహెచ్ 45 గూడూరు నుంచి జాతీయ రహదారి 716 రాజంపేట వరకు ఉన్న రహదారులని విస్తరించాలని కోరారు.
- గూడూరు నియోజకవర్గం చిల్లకూరు మండలం చెన్నై–కోల్‌కతా హైవే నుంచి తూర్పు కనుపూరు మధ్య సాగరమాల కింద కొత్తగా మంజూరయిన జాతీయ రహదారి 516 డబ్ల్యూలో అంకులపాటూరు, రామారెడ్డిపాలెం గ్రామాల వద్ద 12+300 – 14+100 కిలోమీటర్ల మధ్య కల్వర్టులు, అండర్‌పాస్ వంతెనలు, హై–లెవెల్ బ్రిడ్జి రామారెడ్డిపాలెం, అంకులపాటూరు వ్యవసాయ నీటిపారుదల చెరువుల కోసం అవాంతరాలు లేని నీటిపారుదల ఉండేలా రహదారి నిర్మాణం ఉండాలని కోరుతూ మరో ప్రతిపాదన ఇచ్చారు.
- గూడూరు నియోజకవర్గం చిల్లకూరు క్రాస్ రోడ్ నుంచి తూర్పు కనుపూరు జాతీయ రహదారి–516 డబ్ల్యూ వరకు 4 లేన్ల రహదారిలో 2+910 కి.మీ నుంచి 2+990 కి.మీ, 3+730 కి.మీ నుంచి 3+810 కి.మీ, అలాగే 4+120 కి.మీ నుంచి 4+320 కి.మీ వరకు హైలెవల్ వంతెనలు నిర్మించాలని కోరారు. ముత్యాలపాడు చెరువు నుంచి వరద నీరు ఆయకట్టు భూములపై ప్రవహిస్తూ పంబలేరు నదిలో కలుస్తుందని.. పారిచెర్లవారిపాలెం, ముత్యాలపాడు గ్రామాల మధ్య భారీ చెరువుల కారణంగా వరద నీరు వ్యతిరేక దిశలో ప్రవహిస్తుందని..అడ్డంకులు లేకుండా వరద నీరు ప్రవహించేందుకు ప్రతిపాదిత రహదారి ద్వారా 36,834 క్యూసెక్కుల విడుదల చేయడానికి 4+120 కి.మీ నుంచి 4+320 కి.మీ మధ్య తగిన వంతెనలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.
- నాయుడుపేట నుంచి తూర్పు కనుపూరు వరకు ప్రతిపాదిత జాతీయ రహదారిపై 64.950 కి.మీ మరియు 68.790 కి.మీ వద్ద లైట్ వెహికల్ అండర్ పాస్‌ని భారీ వాహనాలు వెళ్లేలా వెహికల్ అండర్ పాస్‌గా మార్చాలని కోరారు.
- రాయలసీమ ప్రజల చిరకాల వాంఛ సీమ నీటి సమస్యకు కీలక పరిష్కారమైన సిద్ధేశ్వరం బ్యారేజి సాకారం కావడం. కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారిలో భాగంగా కృష్ణా నదిపై తీగల వంతెనను రూపొందించింది. దాని స్థానంలో బ్రిడ్జి కం బ్యారేజి నిర్మిస్తే 50 టీఎంసీల నీరు నిల్వ అవుతుందని, దీనివల్ల పోతిరెడ్డిపాడు ద్వారా సీమ ప్రాజెక్టులకు నీరు లభ్యత సాధ్యమవుతుందని రాయలసీమ మేధావుల ఫోరం తరఫున ఆయనకు సిద్ధేశ్వరం అలుగు ప్రాధాన్యతను వివరించారు.ఈ ప్రతిపాదనలపై నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించి, సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని ఆర్‌అండ్‌బీ, ఎన్‌హెచ్ఏఐ అధికారులను ఆదేశించినట్లు ఎంపీ తెలియజేశారు.

క్లుప్తంగా

ఈ మృతుడు ఎవరో..?

- రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



రేణిగుంట: రేణిగుంట రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం ఉదయం రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం వెలుగులోకి వచ్చిందని జీఆర్పీ ఎస్ఐ రవి తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు జీఆర్పీ ఎస్ఐ ప్రమాద స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడికి సుమారు 45 ఏళ్లు ఉంటాయని, పాచి కలర్ బనియన్ ధరించి ఉన్నాడని, కుడి చేతిపై కుమార్ బి.చెన్నప్ప అని పచ్చబొట్టు ఉన్నట్లు చెప్పారు. మృతుడు రైలు నుంచి జారిపడ్డాడా..? ఆత్మహత్యకు పాల్పడ్డాడా..? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించామన్నారు. మృతుని గురించి తెలిసిన వారు ఉన్నపక్షంలో 9963126343 నంబరును సంప్రదించాలని కోరారు.

ప్రయాణికులకు తప్పిన ముప్పు

శాంతిపురం: అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు ముళ్ల పొదల్లోకి దూసుకుపోయిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. కర్ణాటకలోని కేజీఎఫ్ నుంచి కుప్పం వస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ బస్సుకు రాళ్లబూదుగూరు పెట్రోల్ బంకు సమీపంలోని మలుపు వద్ద ద్విచక్ర వాహనం అడ్డు వచ్చింది. దాన్ని తప్పించే ప్రయత్నంలో బస్సు అదుపుతప్పి పల్లపు ప్రాంతంలోకి వెళ్లి వాలిపోయింది. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో సురక్షితంగా బయటపడ్డారు.

అంతరిక్షాన్ని చూసేద్దాం!



ప్రదర్శనలో సౌర మండలం దృశ్యం



సైన్సు సెంటర్‌లో ఆసక్తిగా చూస్తున్న విద్యార్థులు

- డిజిటల్ ప్లానిటోరియం పునఃప్రారంభం
- విద్యార్థులను ఆకట్టుకున్న సరికొత్త ప్రదర్శన

తిరుపతి(అలిపిరి): తిరుపతిలోని ప్రాంతీయ విజ్ఞాన కేంద్రంలో బుధవారం నగరపాలక కమిషనర్ అదితి సింగ్ చేతుల మీదుగా సరికొత్త ప్రదర్శనతో డిజిటల్ ప్లానిటోరియాన్ని పునఃప్రారంభించారు. చంద్రునిపై మానవుడు అడుగుపెట్టిన సందర్భంగా స్పేస్ వీక్–2024 పేరిట బుధవారం నుంచి 23వ తేదీ వరకు ఇక్కడ వివిధ పోటీలు నిర్వహణకు శ్రీకారం చుట్టారు. చారిత్రాత్మక 'మ్యాన్ ల్యాండింగ్ మిషన్' ప్రాముఖ్యతను.. మానవ జాతి అభివృద్ధికి మిషన్‌ను విజయవంతం చేయడానికి అవిశ్రాంతంగా పనిచేసిన శాస్త్రీయ సమాజం ప్రయత్నాలను అదితి సింగ్ వివరించారు. పట్టుదల, విజయవంతం కావాలని.. అనుకున్న లక్ష్యాన్ని సాధించాలనే సంకల్పం ఉండాలన్నారు. అనంతరం 25 నిమిషాల నిడివి గల 'ది సన్ అవర్ లివింగ్ స్టార్' పేరుతో కొత్త ప్లానిటోరియం షోను ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి ప్రదర్శనను వీక్షించారు. అంతరిక్ష శాస్త్రంపై మెరుగైన అవగాహన కోసం ఇలాంటి షోలు చూడాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. సైన్సు సెంటర్ చేస్తున్న కృషిని అభినందించారు. రోజుకు 5 షోలు ప్రదర్శించనున్నట్లు కేంద్రం కో–ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ చెప్పారు. తొలిరోజు 600మంది విద్యార్థులు షోను వీక్షించారని తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ పురుషోత్తం, కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



వీక్షిస్తున్న విద్యార్థులు

చిన్న పిల్లలతో అన్నలా ఎంపీ

- రేణిగుంట బీసీ హాస్టల్ విద్యార్థుల సమస్య పరిష్కారానికి చర్యలు
- ఎంపీ నిధులతో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు కార్యాచరణ

తిరుపతి మంగళం : ఒక ఎంపీని చిన్నపిల్లలు కలిసి వాళ్ల అన్నతోనో... మామయ్యతోనో మాట్లాడినట్లు సమస్య చెప్పుకుని పరిష్కరించుకున్నారు..ఒక పార్లమెంట్ సభ్యుడు ఇలాకూడా ఉంటారా? తమ ఇంట్లో వాళ్లలా దగ్గర కూర్చోపెట్టుకుని మాట్లాడతారా? అని ఆ చిన్నారుల ముఖంలో ఒకింత ఆశ్చర్యం. తాను ఎంపీ అయినా సాధారణ పౌరుడిలా ఉంటానని చేతల్లో చూపించారు తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి.

బుధవారం ఉదయం 11 గంటలు తిరుపతి ఎంపీ గురుమూర్తి తన కార్యాలయంలో కూర్చుని వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నారు. ఇంతలో ఆఫీసు ముందు ఒక ఆటో ఆగింది అందులో నుంచి దిగిన పది మంది ,5, 6, 7, 9 తరగతుల పిల్లలు 'సార్..! ఎంపీ సార్‌ని కలవాలి' అని అడిగారు..వారంతా రేణిగుంట ప్రభుత్వ బీసీ హాస్టల్ విద్యార్థులు. అంతలో లోపలి నుంచి ఆ పిల్లలను చూసిన తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి తన దగ్గరకు పిలిచారు. మొదట వారిని కూర్చోమన్నారు. ఆయనో ఎంపీ కదా!? అని ఒకింత భయం భయంగా దగ్గరికి వెళ్లినా ఆ చిన్నారులకు రెండు నిమిషాల్లోనే వారిని అన్నలాగా అక్కున చేర్చుకుని కలుపుగోలుగా మాట్లాడడంతో వారి ముఖాలు సంతోషంతో వెలిగిపోయాయి. వారి సమస్యను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.



బీసీ హాస్టల్ సమస్యలను పరిష్కరించాలని ఎంపీ గురుమూర్తికి వినతి పత్రం ఇస్తున్న విద్యార్థులు

విద్యార్థులు ఏం చెప్పారంటే..

రక్షిత మంచి నీటి సదుపాయం లేదని కలుషిత నీరుతాగి అతిసారం బారిన పడుతున్నామని ఆయన దృష్టికి తెచ్చారు.

ఎంపీ ఏం చేశారంటే..

స్పందించిన ఎంపీ వెంటనే వారు తెచ్చిన వినతి పత్రం తీసుకుని తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి బీసీ సంక్షేమ హాస్టల్‌లో ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు నిధులు ఇస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ కార్యాలయానికి నిధుల విడుదలకు వెంటనే లేఖ పంపాల్సిందిగా చిన్నారుల ఎదుటే తన పీఏని ఆదేశించారు. అనంతరం వారితో ఎంపీ ముచ్చటించారు. బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

చిన్నారిని హత్య చేసిన నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు

- ఫాస్ట్‌ట్రాక్ కోర్టుతో త్వరిగతిన శిక్ష పడేలా చూస్తాం
- జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు

నాయుడుపేటటౌన్: దొరవారిసత్రం మండలం నెలబల్లి గ్రామ సమీపంలో అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి 8 ఏళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడి, హత్య చేసిన నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు తెలిపారు. చిన్నారిపై లైంగిక దాడి, హత్య ఉదంతంపై జిల్లా ఎస్పీ స్పందించారు. బుధవారం రాత్రి నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాల పోస్టుమార్టం గదిలో ఉన్న చిన్నారి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. లైంగిక దాడి, హత్య కేసులో నిందితుడికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులో త్వరితగతిన కఠిక శిక్ష పడేలా చూస్తామన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్పీ వెంట నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, అర్బన్, రూరల్ సీఐలు శ్రీనివాసరెడ్డి, జగన్ మోహన్, ఎస్ఐ గోపి తదితరులు ఉన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు

పోలీసుల అదుపులో నిందితుడు?

చిన్నారిపై లైంగిక దాడి చేసి హత్య చేసిన బిహార్ ప్రాంతానికి చెందిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలియవచ్చింది.

దొంగల ముఠా అరెస్ట్ : నగలు, బైక్‌లు స్వాధీనం

పాకాల: దొంగల ముఠాను అరెస్ట్ వారి నుంచి నగలు, మూడు మోటార్ సైకిళ్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో తిరుపతి డీఎస్పీ నరసింగప్ప తెలిపిన వివరాలు.. ఈ నెల 16న పాకాల ఎస్ఐలు మహేష్‌బాబు, లోకేష్‌కుమార్ పోలీసులతో కలిసి నేంద్రగుంట అండర్ బ్రిడ్జి వద్ద వాహనాల తనిఖీ చేశారు. అదే సమయంలో పెనుమూరు వైపు నుంచి మోటార్ సైకిళ్లలో వచ్చిన నలుగురు యువకులు పోలీసులను చూసి పరారయ్యారు. ఇది చూసిన వారిని వెంటాడి అదుపులోకి తీసుకున్నారు. ప్రాథమిక విచారణలో..పూతలపట్టు మండలం, వావిల్‌తోటకు చెందిన అన్నదమ్ములు ఎస్.మురళి(21), ఎస్.బాబు(20), పెనుమూరు మండలం మటంపల్లెకు చెందిన హర్షవర్ధన్ (22), గంగుపల్లెకు చెందిన వరుణ్‌కుమార్ (22) అని, వీరంతా చైన్ స్నాచర్ల ముఠా అని తేలింది. రోడ్డు పక్కన ఆపి ఉన్న వాహనాల్లో గ్యాస్ సిలిండర్లు, బ్యాటరీలు చోరీ చేయడం, ఒంటరిగా వెళ్తున్న మహిళల నుంచి చైన్లు స్నాచింగ్ చేయడమే కాకుండా తాళం వేసి వేసిన ఇళ్లలో కూడా చోరీలకు పాల్పడే వారని విచారణలో వెల్లడైంది. నిందితుల నుంచి రూ.5 లక్షల విలువ చేసే 87 గ్రాముల బంగారు ఆభరణాలు, దొంగతనాలకు ఉపయోగించిన 3 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఇక వావిల్‌తోటకు చెందిన అన్నదమ్ములిద్దరూ గతంలో చోరీ కేసుల్లో బాల నేరస్తులుగా జైలు శిక్ష సైతం అనుభవించారని, అయినా వీరి తీరు మారలేదని డీఎస్పీ చెప్పారు. నలుగురిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐ శ్రీరాములు, ఎస్ఐలు, పోలీసులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నగలు, అరెస్ట్ చేసిన నిందితులను చూపుతున్న పోలీసు అధికారులు

బైక్ దొంగ అరెస్ట్: 12 వాహనాల స్వాధీనం



అంతర్రాష్ట్ర దొంగను అరెస్ట్ చూపిస్తున్న సీఐ, ఎస్ఐ

కాణిపాకం: ద్విచక్ర వాహనాల దొంగను పట్టుకుని, రూ.18లక్షలు విలువ చేసే 12 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం కాణిపాకం పోలీస్ స్టేషన్‌లో సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్ఐ రామ్మోహన్ వెల్లడించిన వివరాల మేరకు... ఉదయం కాణిపాకం పోలీసులు ముద్దిపట్లపల్లె క్రాస్ వద్ద వాహనాల తనిఖీ చేశారు. అటువైపు బైక్‌పై వస్తున్న బంగారుపాళెం మండలం బందలదొడ్డికి చెందిన తుమ్మల ఈశ్వర్ అలియాస్ కోటేశ్వర్‌రావు (35) పోలీసులను చూసి పరారయ్యాడు. అనుమానించిన పోలీసులు అతడిని వెంబడించి పట్టుకున్నారు. బైక్‌ను కాణిపాకంలో చోరీ చేసినట్లు ఈశ్వర్ పోలీసులకు చెప్పాడు. దీంతో అతడిని కాణిపాకం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేస్తే చోరీ చేసిన ద్విచక్ర వాహనాల గుట్టు విప్పాడు. వెంటనే పోలీసులు బంగారుపాళెం మండలం శివపురం ఎస్టీ కాలనీ వద్ద నిందితుడు దాచి ఉంచిన రూ.8 లక్షల విలువ చేసే 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిని చిత్తూరు, బంగారుపాళ్యం, తవణంపల్లె, ఐరాల, తిరుపతి, తిరుచానూరు, పెనుమూరు, యాదమరి, రేణిగుంట, కాణిపాకం ప్రాంతాల్లో చోరీ చేసినట్లు నిర్ధారించారు. నిందితునిపై కేసు నమోదు చేయడంతో పాటు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చాకచక్యంగా నిందితుడిని గుర్తించి పట్టుకుని, 12 ద్విచక్ర వాహనాలను రికవరీ చేసిన పోలీసులను అభినందించారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తులు

తిరుపతి ఎడ్యుకేషన్ : నవోదయ విద్యాలయాల్లో 2025–26వ విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్షలకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ వెలువడింది. ఆ మేరకు తిరుపతిలోని విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్ నవోదయ విద్యాలయాలు దేశవ్యాప్తంగా 653, ఇందులో మన రాష్ట్రంలో 15, తెలంగాణలో 9 ఉన్నాయన్నారు. ఈ విద్యాలయాల్లో అత్యున్నత ప్రమాణాలతో సీబీఎస్ఈ సిలబస్‌తో ఉచిత విద్య, అలాగే ఉచిత వసతి, భోజనం సౌకర్యాలు కల్పిస్తారని తెలిపారు. రెగ్యులర్ చదువుతో పాటు నీట్, జేఈఈ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇస్తారన్నారు. ఏటా ఒక్కో నవోదయ విద్యాలయంలో 80మందికి ఆరో తరగతిలో ప్రవేశం కల్పిస్తారని పేర్కొన్నారు. 2025, జనవరి 18వ తేదీన జాతీయ స్థాయిలో నిర్వహించే జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్టు(జేఎన్‌వీఎస్‌టీ)కు ఈ ఏడాది 5వ తరగతి చదివే విద్యార్థులు అర్హులని, దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబరు 16వ తేదీ ఆఖరు అని తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించి పూర్తి వివరాలకు 86888 88802, 93999 76999నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

మీ బిల్లును మీరే లెక్కించుకోవచ్చు

- ఏపీఎస్పీడీసీఎల్ యాప్‌లో మరిన్ని ఫీచర్లు
- విద్యుత్ వినియోగం తెలుసుకునే వెసులుబాటు
- అందుబాటులో గత చెల్లింపుల వివరాలు

చిత్తూరు కార్పొరేషన్: గంటల సేపు క్యూలో నిలబడి బిల్లులు కట్టే కాలం మారిపోయింది. ప్రస్తుతం సమయం విలువైనది. యూపీఐ యాప్స్‌లో పలు బిల్లింగ్ పేమెంట్స్ అందుబాటులో వచ్చాక అందులోనే చెల్లింపులు చేస్తున్నారు. ప్రస్తుతం ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం అందులో బిల్లింగ్ ఆప్షన్ తీసివేశారు. కరెంటు బిల్లు కట్టాలంటే విద్యుత్‌శాఖ వెబ్‌సైట్‌లో నేరుగా చెల్లించే అవకాశం కల్పించారు. ఏపీఎస్పీడీసీఎల్ యాప్ లేదా వెబ్‌సైట్‌లో కరెంటు బిల్లు చెల్లింపుతో పాటు సర్వీసు పరంగా పలు వివరాలను తెలుసుకునే అవకాశం కల్పించారు.

అందుబాటులో వివరాలు

గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈ మొబైల్ యాప్ డౌన్లోడ్ చేసుకుని వినియోగ దారుడి 16 అంకెల సర్వీస్ నంబర్ నమోదు చేసుకోవడం ద్వారా మొబైల్ యాప్ సేవలను పొందవచ్చు. ఇందులో మెయిల్ ఐడీతో రిజిస్ట్రేషన్ చేసుకొని లాగ్‌ఇన్ ఇవ్వాలి. తర్వాత యాప్‌లో 'బిల్ పే' ఆప్షన్ ద్వారా విద్యుత్ బిల్లులను ఎలాంటి అదనపు రుసుం లేకుండా సులభంగా కట్టవచ్చు. వినియోగదారు సర్వీసుకు సంబంధించిన విద్యుత్ వినియోగం, బిల్లు వివరాలు, బిల్లు చెల్లింపు, విద్యుత్ సరఫరా పరిస్థితి వివరాలు తెలుసుకునేలా సరికొత్త ఫీచర్లు అందుబాటులో ఉంచారు.

చెల్లింపుల వివరాలు

ఈ యాప్‌లో పేమెంట్ హిస్టరీలో ప్రతి నెలా చెల్లించిన బిల్లుల వివరాలు చూసుకోవచ్చు. వీటితో పాటు ఎన్ని యూనిట్లు వినియోగించాం.. కరెంటు బిల్లు ఎంత... ఇతర చార్జీల వివరాలతో కలిపి మొత్తం బిల్లు ఎంత అనే వివరాలు తెలుసుకోవచ్చు. వీటితో పాటు లైట్, ట్యూబ్ లైట్, ఫ్రిజ్, ఏసీ, కూలర్, ఫ్యాన్, ఐరన్‌బాక్స్, గ్లీజర్, వాషింగ్‌మెషీన్, టీవీ, మిక్సీ, గ్రైండర్, కంప్యూటర్, నీళ్ల మోటార్ వంటి విద్యుత్ పరికరాలు ఎన్ని ఎంత సేపు వాడితే నెలకు ఎన్ని యూనిట్లు రావచ్చు అనే అంచనా వివరాలు తెలుసుకోవచ్చు. ఇంక సర్వీసు ఏ సెక్షన్ పరిధిలో ఉంది, ఏ ఫీడర్, సబ్‌స్టేషన్ నుంచి సరఫరా వస్తున్నది. ఏఈ, డీఈ నంబర్లు కూడా అందుబాటులో ఉంచారు. వీటితో పాటు ఫిర్యాదులు చేసుకునే సౌలభ్యమూ ఉంది. మీటర్, బిల్లింగ్, స్లపయ్, ఇన్సిడెంట్, ఓల్టేజీ, ట్రాన్స్‌ఫార్మర్ వంటి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు.

విద్యుత్ సమస్యలపై ఫిర్యాదు

'మై యూసేజ్' ఆప్షన్ ప్రస్తుత వినియోగపు యూనిట్ల సంఖ్యను నమోదు చేయడం ద్వారా విద్యుత్ బిల్లును లెక్కించుకోవచ్చు. యాప్ ద్వారా ఆధార్ నంబర్‌కు విద్యుత్ సర్వీసును అనుసంధానం చేసుకోవడంతోపాటు విద్యుత్ సంబంధిత సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చు. బిల్‌పే ఆప్షన్‌లో మన సర్వీసు నంబరు, యజమానిపేరుతో పాటు కేటగిరి బిల్లు ఇచ్చిన తేదీ, కట్టాల్సిన మొత్తం వివరాలు అందులో ఉంటుంది. వీటితో పాటు కనెక్షన్ ఆప్షన్‌లో కొత్త కనెక్షన్, దాని రుసుం, అప్లికేషన్ స్టేటస్, ఆన్‌లైన్ సర్వీస్ రిక్వెస్ట్ వివరాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. మొబైల్ నంబరు అనుసంధానం చేసుకునే అవకాశం కల్పించారు.

ఎంతో ఉపయోగం




ఏపీఎస్పీడీసీఎల్ యాప్ లేదా సైట్ ద్వారా చెల్లింపులు చేస్తే నేరుగా సంస్థ ఖాతాలో పడుతుంది. వినియోగదారులకు మరిన్ని ఫీచర్లతో సమాచారం తెలుసుకునే అవకాశం కల్పించారు. వాడకం, ఫిర్యాదు, కేటగిరి, సరఫరా వివరాలతో పాటు పలు విషయాలను తెలుసుకోవచ్చు. ఎటువంటి సమస్యలు ఉన్నా టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫిర్యాదు చేయండి.

– సురేంద్రనాయుడు, ఎస్ఈ, ట్రాన్స్‌కో

చిల్లకూరులో రొట్టెల పండుగ రేపు

- దో షహీద్ దర్గాలో ఏర్పాట్లు పూర్తి

చిల్లకూరు: మొహర్రం పండుగ రోజు నుంచి నెల్లూరులోని భారా షహీద్ దర్గాలో రొట్టెల పండును నిర్వహించడం ఆనవాయితీ. ఇక్కడ నిర్వహించే రొట్టెల పండుగకు భారత దేశంలోని నలుమూలల నుంచి ముస్లింలు, హిందువులు వచ్చి ఇక్కడ స్వర్ణాల చెరువులో రొట్టెలు పరస్పరం స్వీకరిస్తారు. అంతటి ప్రసిద్ధి చెందిన నెల్లూరులోని రొట్టెల పండుగ తరువాత చిల్లకూరులోని దో షహీద్ దర్గాకు స్థానం ఉంది. ప్రాచీన కాలంలో ముష్కరులకు, ప్రవక్తలకు జరిగిన ప్రత్యక్ష యుద్ధంలో 13 మంది ప్రవక్తల తలలు తెగనరికినట్లు చరిత్ర చెబుతోంది. వీరిలో 11 మంది తలలు భారాషహీద్ దర్గా ఉన్న ప్రాంతంలో పడిపోగా సయ్యద్ మహ్మద్ షా, సయ్యద్ అహ్మద్ షా అనే సహోదరులిద్దరి తలలు తెగినప్పటికీ గుర్రాలపై మిగిలిన శరీరం(మొండెం) చిల్లకూరు దర్గా నిర్మించిన ప్రాంతంలో పడినట్లు ఈ ప్రాంత వాసులు చెబుతుంటారు. బొబ్బిలికి చెందిన ఓ రాణి చెన్నైకు వెళుతూ మార్గమధ్యంలో చిల్లకూరు ప్రాంతంలో సేద తీరిన సమయంలో ఆమె కలలో ప్రవక్తలైన ఇద్దరు సహోదరులు కనిపించి తమకు ఈ ప్రాంతంలో దర్గా నిర్మించాలని కోరారట! దీంతో ఆమె ఈ ప్రాంతంలో దర్గా(సమాధులు) నిర్మించారు. దో షహీద్ దర్గాలో శుక్రవారం రొట్టెల పండుగను నిర్వహిస్తున్నట్లు దర్గా ముతవల్లీ జుబేద్ బాషా తెలిపారు. చెన్నై, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి నెల్లూరుకు వెళ్లిన ప్రతి భక్తుడు ఇక్కడ దర్గాను సందర్శించడం పరిపాటి.



దోషహీద్ దర్గాలోని సయ్యద్ అహ్మద్ షా, సయ్యద్ మహ్మద్‌షా సమాధులు

వామ్మో చిరుత..!

- కొటాల జగనన్న కాలనీ సమీపంలో సంచారం
- సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన వీడియో
- అప్రమత్తమైన అటవీ అధికారులు

చంద్రగిరి: జనావాస ప్రాంతాల సమీపంలో చిరుత సంచరించడంతో స్థానికులు బెంబేలెత్తిపోయారు. ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలు.. మండలంలోని కొటాల జగనన్న కాలనీ సమీపంలోని శేషాచల అటవీ ప్రాంతంలో మంగళవారం ఓ చిరుత పులి వచ్చినట్లు వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. కాలనీకి కిలోమీటరు దూరంలోని ఓ పెద్ద బండపై చిరుత పులి ఉండటాన్ని గమనించిన స్థానికులు హడలిపోయారు. వెంటనే మేడపై నుంచి తమ సెల్‌ఫోన్లలో చిరుత పులి సంచారాన్ని వీడియో తీశారు. అనంతరం సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడంతో ఇవి వైరల్ అయ్యాయి. చిరుత పులి కాలనీలోకి వచ్చే అవకాశం ఉందంటూ స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణం పనులు చేస్తుండడంతో లబ్ధిదారులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వీడియోలను పరిశీలించిన అటవీ అధికారులు అది చిరుతగా తేల్చారు. నివాస గృహాల వైపు రాకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

బస్టాండ్‌లో సీసీ కెమెరాలు తప్పనిసరి



దుకాణదారుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రవి మనోహరాచారి

- కెమెరాల ఏర్పాటుకు వ్యాపారులు ముందుకురావాలి
- ఈస్ట్ డీఎస్పీ మనోహరాచారి

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్ చోరీలకు నిలయంగా మారుతోందని, సీసీ కెమెరాలు ఏర్పాటుకు ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఈస్ట్ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ రవి మనోహరాచారి కోరారు. బుధవారం ఆయన తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి(డీపీటీఓ) కార్యాలయంలో ఆర్టీసీ అధికారులతో కలసి తిరుపతి బస్టాండ్‌లోని దుకాణదారులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, బస్టాండ్‌లో చోరీలు, నిషేధిత వస్తువుల అక్రమ రవాణా, పిల్లల కిడ్నాప్..ఉదంతాలు సైతం చోటుచేసుకుంటున్నాయని, వీటన్నింటికీ చెక్ పెట్టడానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడమే ఉత్తమమన్నారు. ఇక్కడి నాలుగు బస్టాండ్ల ప్రాంగణంలో మొత్తం 64 ప్లాట్‌ఫారాలు ఉన్నాయని, నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ బస్టాండులో దొంగలను గుర్తించడం కష్టతరమని, దీనికి పోలీసులను కూడా ఎక్కువగా విధులకు కేటాయించాల్సి వస్తోందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఒక సీసీ కెమెరా 1000 మంది పోలీసులు చేసే పని చేస్తుందని పేర్కొన్నారు. బస్టాండ్ ప్రాంగణంలో 147 దుకాణాలున్నాయని, ఒక్కో దుకాణదారుడు రూ.4 వేల నుంచి 5 వేలు చెల్లిస్తే చోరీలు ఎక్కువగా జరుగుతున్న ప్లాట్‌ఫాంల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. దుకాణదారులు ఒక కమిటీగా ఏర్పాటై దీనికి పూనుకోవాలని సూచించారు. తిరుపతి బస్టాండ్‌లో ప్రయాణికుల రాకపోకల నేపథ్యంలో 24 గంటలు దుకాణాలు నిర్వహిస్తున్నా తాము అడ్డు చెప్పడం లేదన్నారు. ఆర్టీసీ డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్ర నాయుడు,ఈస్ట్ పోలీస్ స్టేషన్ సీఐ మహేశ్వర్‌రెడ్డి, ఎస్ఐలు పురుషోత్తంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.